సాక్షి రంగారెడ్డి

సోమవారం । 3 । జూలై । 2023



ఘనంగా గురుపౌర్ణమి

పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో నిర్వహిస్తున్న గురు పౌర్ణమి ఉత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. 8లో▸



ఆమనగల్లులో ఏసీపీ ఆఫీస్

పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. 8లో▸



క్రీడాకారులను అందించడమే లక్ష్యం

దేశానికి అవసరమయ్యే క్రీడాకారులను అందించడమే లక్ష్యమని ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు సుధాకర్‌శర్మ, కడారి జంగయ్యయాదవ్, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి ఎల్మటి దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు అనేగౌని అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి వ్యాపారులకు వివరించారు. అంతకుముందు చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ప్రతి గడపకూ అందుతున్నాయన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధితో పాటు కరోనా సమయంలో దేశ ప్రజలకు ఉచితంగా టీకాలు అందించి ప్రాణాలు కాపాడటంలో నరేంద్రమోదీ ఎంతో కృషి చేశారన్నారు. ఉపాధిహామీ పథకం, జాతీయ రహదారుల అభివృద్ధి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత కరెంటు మీటర్లు, రైతులకు సబ్సిడీపై ఎరువుల వంటి పథకాలు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్, ఎంపీపీ మంద జ్యోతి, రాష్ట్ర నాయకుడు టి.విష్ణు, జిల్లా నాయకులు శేఖర్, ఎస్.నర్సింహారెడ్డి, బొక్క సత్యనారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు నిమ్మ అంజిరెడ్డి, ఊటు మహేందర్, సర్పంచ్ గౌర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఉజ్జయినీ మహంకాళి

అమ్మవారికి తొలి బోనం



అమ్మవారి బోనానికి పూజలు చేస్తున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి అంగరంగ వైభవంగా ఆదివారం తొలిబోనం సమర్పించారు. జోగిని శ్యామల బోనాన్ని తలపైపెట్టుకుని డప్పుల దరువులు, పోతరాజుల వీరంగాల మధ్య నృత్యం చేస్తూ బోయిగూడలోని మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్ ఇంటి నుంచి ఊరేగింపుగా వచ్చారు. అంతకు ముందు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. జోగిని శ్యామల దేవాలయంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, నాయకులు తలసాని సాయికిరణ్ యాదవ్, దరం యాదవ్, స్కైలాబ్, మహేష్ యాదవ్ తదితరులు అమ్మవారి బోనం ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ నెల 9, 10వ తేదీల్లో జరగనున్న ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుణ్ని చంపేశారు



ఆఖీల్ (ఫైల్)

మియాపూర్: మద్యం మత్తులో స్నేహితుడిని చంపిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దశరథ్ చెప్పిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన మహ్మద్ ఆఖీల్(25) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. బక్రీద్ సందర్భంగా ఆఖీల్ న్యూ హాఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్‌కు వచ్చి తన పాత స్నేహితులు షేక్ ఆసీఫ్ (22), మహ్మద్ అబ్బాస్ (23), సమీర్‌ఖాన్(22), షేక్ అమీద్ (25), అస్లాంఖాన్ (20), మహ్మద్ ఫరుసుద్దీన్ (22)లతో కలిసి శనివారం రాత్రి మద్యం తాగారు. ఈ క్రమంలో గొడవ జరిగి ఒకరినొకరు కొట్టుకున్నారు. కోపోద్రిక్తులైన ఆరుగురు స్నేహితులు కలిసి ఆఖీల్‌ను చాకుతో కడుపులో పొడిచి, సుత్తె, బండరాయితో తలపై మోది హత్య చేసి పరారయ్యారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

భళా.. ఆరోగ్య మహిళ

- మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- 'ఆరోగ్య మహిళ'కు ప్రభుత్వం శ్రీకారం
- ప్రతి మంగళవారం ప్రత్యేక వైద్య పరీక్షలు
- జిల్లాలోని 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు
- వ్యాధుల నిర్ధారణకు అనుగుణంగా చికిత్స



పరీక్షలు చేస్తున్న డాక్టర్



ఆరోగ్య మహిళ నమోదు పుస్తకం

కొందుర్గు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం సమగ్ర మహిళా ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా «ఆరోగ్య మహిళ» అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేకంగా మహిళా వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎనిమిది రకాల సర్వీస్ ప్యాకేజీలు అందుబాటులో ఉంచారు. వైద్య పరీక్షలు చేసేందుకు జిల్లాలో 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గుర్తించారు. షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రి పరిధిలో నందిగామ, కేశంపేట, కొందుర్గు, చింటోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్నారు.

వైద్య పరీక్షలు ఇవీ..

ప్రస్తుతం అత్యధికంగా మహిళలు కేన్సర్ బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో కేన్సర్‌కు సంబంధించిన పరీక్షల నిర్వహణపై ఎక్కువగా దృష్టి సారించారు. డయాగ్నొస్టిక్స్, కేన్సర్ స్క్రీనింగ్, సూక్ష్మ పోషక లోపాలు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్, కుటుంబ నియంత్రణ, రుతుస్రావ సమస్యలు, సంతాన లేమి, మెనోపాజ్ నిర్వహణ, లైంగిక వ్యాధుల నిర్వహణ, శరీర బరువు నిర్వహణ వంటి వ్యాధులకు సంబంధించి రక్త పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల ఫలితాలకు అనుగుణంగా చికిత్స అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్రంలో 18.8 శాతం మహిళలు నిర్ణీత బరువుకన్నా తక్కువ కలిగిఉన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, గుండెజబ్బు, కీళ్ల నొప్పులు, కేన్సర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. సాధ్యమైనంతవరకు ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి, ఫాస్ట్‌ఫుడ్ తినకూడదు, తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ అమ్రిత జోసెఫ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొందుర్గు

రైతుల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య యాదవ్

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్

షాద్‌నగర్: అన్నదాతల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట వేసిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో ఉన్న వసంతరెడ్డి ఫంక్షన్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతోందని తెలిపారు. రైతులు పండిస్తున్న పంటలకు సరైన మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తోందన్నారు. సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేస్తోందని చెప్పారు. తొమ్మిదేళ్లకాలంలో రూ.4.7లక్షల కోట్ల రుణాలను మంజూరు చేసిందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నేతలు తెలంగాణలో రైతులను అన్యాయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పటోళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు రాజ్యం రావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్‌పై భారీ వాహనాలు నిషేధం

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్‌పై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆదివారం ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశి గడ్డం తెలిపారు. తరచూ ఫ్లైఓవర్‌పై రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు పలు కారణాలతో ఆగిపోతుండటంతో ట్రాఫిక్‌జాం అవుతున్నట్లు ఆయన చెప్పారు. దీంతో వాహనదారులు తమ విలువైన సమయాన్ని కోల్పోవడమే కాకుండా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా లారీలు, ట్రావెల్స్ బస్సులు, టిప్పర్లు, పెట్రోల్, సిమెంట్, వాటర్ ట్యాంకర్లు, టస్కర్లు తదితర అతిభారీ వాహనాలను ఫ్లైఓవర్‌పై వెళ్లేందుకు అనుమతి నిలిపివేస్తున్నట్లు ఆయన స్పష్టంచేశారు. నిషేధిత వాహనాలు ట్రాఫిక్ ఆదేశాలను అధిగమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి



గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి

మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని శ్రీనగర్ (ఈ–సిటీ) శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని శివగంగదేవాలయం, ఆర్‌కేపురం డివిజన్‌లోని ఖిల్లా మైసమ్మ, బాలాపూర్ శ్రీ సంతాన వేణుగోపాల స్వామి, తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని జిన్నాయిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి, ఈ–సిటీ వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు ఇతర ఆలయాల అభివృద్ధికి ఒక్కో గుడికి రూ.కోటి చొప్పున రూ.8 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం మున్సిపల్ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గౌడ కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్, కౌన్సిలర్ రవినాయక్, వేంకటేశ్వర ఆలయ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'ప్రైడ్ ఆఫ్ తెలంగాణ'



వివిధ రంగాల్లో విశేష సేవలందించి స్ఫూర్తిదాయకంగా నిలిచిన వ్యక్తులకు 'రౌండ్ టేబుల్ ఇండియా' ఆధ్వర్యంలో 'ప్రైడ్ ఆఫ్ తెలంగాణ– 2023' అవార్డులను అందించింది. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో వీటిని అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో



షాబాద్ మండలం గోపిగడ్డలో డ్రిప్‌తో సాగవుతున్న మిరప పంట (ఫైల్)

డ్రిప్.. గప్‌చుప్

- పరికరాల కోసం రైతుల దరఖాస్తు
- సీజన్ ప్రారంభమై నెల కావస్తున్నా స్పందన కరువు
- ఎదురుచూస్తున్న అన్నదాతలు

షాబాద్: మెట్ట ప్రాంతాల్లో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏటా సబ్సిడీపై డ్రిప్ పరికాలను అందిస్తోంది. వానాకాలం ప్రారంభానికి ముందే ఈ పరికరాలను అందించాల్సి ఉండగా, ఈ ఏడాది జూలైనెల ప్రారంభమైనా నేటికీ పైసా విడుదల కాలేదు. కూరగాయలు, పండ్ల తోటల సాగుకు డ్రిప్ తప్పనిసరి. ఈ ఏడాది వెయ్యి హెక్టార్ల విస్తీర్ణానికి సరిపడా డ్రిప్ పరికాల కోసం రైతులు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ అందలేదు. దీంతో ఎదురుచూపులు తప్పడం లేదు.

వెయ్యి హెక్టార్లలో..

విత్తనాలు మొదలు డ్రిప్, స్ప్రింక్లర్లను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది. జిల్లాలో కూరగాయల సాగుతో పాటు పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. 2 వేల ఎకరాల్లో కూరగాయలు, మరో 500 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు డ్రిప్పు పరికరాలు అందించాలని ఇప్పటికే ఉద్యానవనశాఖ అధికారులకు రైతుల నుంచి దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసుకున్నవారిలో షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, శంషాబాద్, షాద్‌నగర్, కేశంపేట, ఆమనగల్లు, కడ్తాల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు తదితర మండలాల నుంచి ఎక్కువ మంది ఉన్నారు. గతేడాది సుమారు 500 హెక్టార్లలో డ్రిప్‌నకు డిమాండ్ ఉండగా, ప్రభుత్వం 76 హెక్టార్లకు మాత్రమే అందించి చేతులు దులుపుకొంది. సబ్సిడీ పరికరాలు అందకపోవడంతో సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా కూరగాయలను పక్క జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ధరలు అధికమవుతున్నాయి. రైతులకు సబ్సిడీపై అందించే పరికరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కటిగా ఎత్తి వేస్తుండడంతో ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది.

తక్కువ వ్యయం

తక్కువ నీటితో ఎక్కువ పంటలు సాగుచేసేందుకు డ్రిప్ ఉపయోగకరంగా ఉంటుంది. ఎకరం వరి పండించే నీటితో డ్రిప్ ద్వారా 5 నుంచి 6 ఎకరాల్లో కూరగాయలు సాగు చేయొచ్చు.

మెట్ట ప్రాంతాల్లో బోరుబావుల్లో లభించే కొద్దిపాటి నీటితో సాగుచేసేందుకు అవకాశం ఉంటుంది. ఎకరంలో డ్రిప్ ఖర్చు ఏర్పాటుకు సుమారు రూ.55 వేల వరకు ఖర్చవుతుంది. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీపై, బీసీలకు 90 శాతం, ఓసీలకు 5 ఎకరాల వరకు 80 శాతం సబ్సిడీపై ఈ పరికరాలను అందిస్తోంది. సీజన్ ప్రారంభంలోనే వీటిని అందించాల్సి ఉండగా నెలరోజులు గడుస్తున్నా డ్రిప్ జాడ లేకుండా పోయింది.

నివేదిక పంపాం



జిల్లాకు వేయి హెక్టార్లకు డ్రిప్ అవసరం ఉంది. మండలాల నుంచి రైతులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. ఈ వివరాలతో కూడిన నివేదికను కమిషనరేట్‌కు అందించాం. ప్రభుత్వం మంజూరు చేయగానే రైతులకు అందిస్తాం.

– అశోక్, ఉద్యానవశాఖ అధికారి, చేవెళ్ల

స్లాబ్ కూలి ఇద్దరు కార్మికుల మృతి



పహాడీషరీఫ్: బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకొని వచ్చిన కూలీలు నిర్మాణ సంస్థ నిర్లక్ష్యానికి బలయ్యారు. స్లాబ్ కూలి ఇద్దరు మృతి చెందారు. అయిదుగురికి తీవ్ర గాయాలైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. మహేశ్వరం ఏసీపీ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ (ఈ–సిటీ) సమీపంలో ఉన్న ప్రీమియర్ సోలార్ ఎనర్జీ కంపెనీకి నూతనంగా మరో అడ్మిన్ బ్లాక్ నిర్మాణాన్ని యజమాని మహేష్ రెడ్డి వీక్షిక సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించారు. మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్, నాగర్‌కర్నూల్‌కు చెందిన 25 మంది కార్మికులతో స్లాబ్ వేశారు. ఆదివారం స్లాబ్‌పై కొందరు, దాని కింద ఇంకొందరు కార్మికులు పనులు చేస్తున్నారు. మధ్యాహ్నం ఒక్కసారిగా స్లాబ్ కూలుతుండడంతో అప్రమత్తమైన కొందరు పరుగు తీయగా... ఏడుగురు స్లాబ్ శిథిలాల కింద చిక్కుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుప్పగండ్ల తుమ్మల కుంట తండాకు చెందిన రామావత్ రాంజ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య భారతి (30)కు రెండు కాళ్లు విరిగాయి. తీవ్ర గాయాలకు గురైన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన హరిప్రసాద్ భరద్వాజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. గాయాలపాలైన అనిత, రాజేశ్వరి, లక్ష్మణ్, గణేష్‌లు శంషాబాద్‌లోని చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ అంజయ్య, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.సతీష్, ఎస్సై మధుసూదన్‌లు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారని.. సదరు సంస్థపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ఇద్దరు స్నేహితులను బలి తీసుకున్న రోడ్డు ప్రమాదం
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు
- ఒకే గ్రామానికి చెందిన ఇద్దరి మృతితో ఎలికట్టలో విషాదఛాయలు



ఘటనా స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



రాజు(ఫైల్)



మధు (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదం బంగారు భవిష్యత్తు ఉన్న ఇద్దరు యువకులను బలితీసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట పంచాయతీ పరిధిలోని మహాల్ ఎలికట్ట గ్రామానికి చెందిన రాజు(18), మధు (19) స్నేహితులు. మధు గ్రామ శివారులోని ఓ పెట్రోల్ పంపులో, రాజు షాద్‌నగర్ పట్టణంలోని ఓ జ్యూస్ షాపులో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నారు. ఆదివారం మధును పెట్రోల్ పంపులో వదిలి పెట్టేందుకు రాజు షాద్‌నగర్‌కు చెందిన మరో స్నేహితుడు పురుషోత్తంతో కలిసి ద్విచక్రవాహనంపై ఎలికట్ట నుంచి షాద్‌నగర్ వైపు బయలుదేరారు. పెట్రోల్ పంపునకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనాన్ని యూ టర్న్ తీసుకుంటున్న సమయంలో షాద్‌నగర్ వైపు నుంచి ఎలికట్టవైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజు, మధు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలైన పురుషోత్తంను మెరుగైన వైద్యంకోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

మరణంలోనూ వీడని స్నేహం

రాజు, మధు ప్రాణ స్నేహితులు. తమ విధులు వేరైనా ఇంటికి వచ్చిన తరువాత ప్రతిరోజు కలిసి తిరిగేవాళ్లు. గ్రామంలోనూ అందరితో కలివిడిగా ఉండేవారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రెండు కుటుంబాల్లో తీరని విషాదం

మహాల్ ఎలికట్ట గ్రామానికి చెందిన మొగులయ్య, మల్లమ్మ దంపతులకు ఒక కూతురు, కొడుకు ఉన్నారు. మొగులయ్య పది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కూతురు వివాహం చేసుకొని వెళ్లిపోగా మల్లమ్మకు కొడుకు మధు ఆసరాగా ఉన్నాడు. రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందడంతో తల్లి కన్నీరు మున్నీరుగా విలపించింది. చేతికందివచ్చిన కన్నకొడుకు దూరమయ్యాడని రాజు తల్లిదండ్రులు చెన్నయ్య, మంజుల కన్నీరుమున్నీరయ్యారు. మొత్తానికి రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

ఘటనా స్థలిని పరిశీలించిన పోలీసులు

రోడ్డు ప్రమాద విషయాన్ని తెలుసుకున్న పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఎస్‌ఐ విజయ్, పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

స్కూటీ అదుపుతప్పి మహిళ మృతి


శోభారాణి(ఫైల్)

మొయినాబాద్: స్కూటీ అదుపు తప్పి రోడ్డుపై పడటంతో ఓ మహిళ ఘటనాస్థలిలోనే మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, అతని భార్య శోభారాణి(55) ఆదివారం ఉదయం చేవెళ్ల మండలం మల్కాపూర్‌లోని తమ కూతురు వద్దకు స్కూటీపై వెళ్లారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో తిరిగి ఇంటికి వెళ్తున్నారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై కేతిరెడ్డిపల్లి గేటు సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ రిసార్ట్స్ వద్దకు రాగానే ఎదురుగా ఏదో వాహనం వచ్చినట్లు అనిపించడంతో స్కూటీ అదుపుతప్పింది. దీంతో స్కూటీపై వెనకాల కూర్చున్న శోభారాణి ఎగిరి రోడ్డుపై పడడంతో ఆమె తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ నడుపుతున్న సుధాకర్‌రెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఘనంగా గురుపౌర్ణమి ఉత్సవాలు


భక్తులకు ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి


హాజరైన భక్తులు

కందుకూరు: గురు పౌర్ణమిని పురస్కరించుకుని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారం రెండో రోజు ఘనంగా జరిగాయి. ఉదయం శివలింగానికి, శ్రీనిఖిలేశ్వరానంద స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు విశేష సాధనలు ఇచ్చి వారితో జపాలు చేయించారు. అంతకుముందు గణపతి, గురు మంత్ర హోమం నిర్వహించారు. అనంతరం గురూజీ భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వాదాలు అందించి ప్రవచనాలు చేశారు. ప్రతి నిత్యం సాధన చేస్తే భగవంతుడి కృపకు పాత్రులు అవుతారన్నారు. సాధనలతో అన్ని పనులు సుసాధ్యమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ సాధనా మార్గంలో పయనిస్తూ తోటి వారితో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. నృత్యాలు, భక్తి గీతాలు, భాగవతం తదితర నాటికలతో కళాకారులు ఆకట్టుకున్నారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఆంగ్ల అధ్యాపకురాలు విజయలక్ష్మికి డాక్టరేట్


డాక్టరేట్ పట్టా పొందిన విజయలక్ష్మి

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా పనిచేస్తున్న శ్రీమతి పాగుల విజయలక్ష్మి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ పట్టా పొందారు. ట్రావెర్సింగ్ మల్టీపుల్ వరల్డ్స్, ఏ స్టడీ ఆఫ్ ది సెలెక్టెడ్ నావెల్స్ ఆఫ్ అనితారావు బాదామి, మోనికా అలీ అండ్ చందాని లోకుగే అంశంపై ఆచార్య అనిల్‌కృష్ణ పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. అంతర్జాతీయ, ప్రభ్యాత జాతీయ జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ పట్టా పొందిన విజయలక్ష్మిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు, అధ్యాపక బృందం, సిబ్బంది అభినందించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


కృష్ణయ్య

మీర్‌పేట: మతిస్థిమితం సరిగ్గా లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ బద్యానాయక్ కథనం ప్రకారం.. కొందుర్గు మండలం విశ్వనాథపూర్ గ్రామానికి చెందిన కె.కృష్ణయ్య (37)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా కుటుంబ సభ్యులు కొంత కాలంగా మీర్‌పేట ఆర్ఎన్‌రెడ్డినగర్‌లోని బంధువుల ఇంట్లో ఉంచి ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. వారం రోజుల క్రితం ఆర్ఎన్‌రెడ్డినగర్ బస్టాప్ వద్దకు వెళ్లి కనిపించకుండా పోయాడు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

మహేశ్వరం: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఓ గృహిణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆదివారం మండల కేంద్రంలోని అశ్విని హెయిర్‌ఆయిల్ ఆయుర్వేదిక్ ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వద్ద చోటు చేసుకుంది. సీఐ మునీ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్చన బన్సాల్, సంజయ్ కుమార్ బన్సాల్ దంపతులు. మహేశ్వరంలో ఉన్న అశ్విని హెయిర్‌ఆయిల్ ఆయుర్వేదిక్ ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కార్మికులుగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అర్చన కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈక్రమంలో జీవితంపై విరక్తితో ఆదివారం ఉదయం 10.30 గంటలకు కంపెనీ వెనుకాల కార్మికులు నివసించే క్వార్టర్స్ వద్ద ఇనుప మెట్లకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రాజ్‌కలి బన్సాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం

- సీఎంను అభ్యర్థించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- చర్యలు చేపట్టిన పోలీసుశాఖ
- ఏర్పాటుకు అధికారుల ప్రతిపాదనలు



ఆమనగల్లులోని పోలీసు స్టేషన్

ఆమనగల్లు: పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అభ్యర్థించారు. దీంతో ఏసీపీ కార్యాలయ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు. శాసనసభ ఎన్నికల ముందే ఏసీపీ కార్యాలయ ఏర్పాటుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

ఐదు మండలాలతో..

కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలు రంగారెడ్డి జిల్లాలో ఉన్నాయి. కొత్తగా మాడ్గుల మండలంలోని సగం గ్రామాలతో ఇర్విన్ మండలం ఏర్పాటై ఆరెంది. ఐదు మండలాలతో ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉండగా మాడ్గుల మండలం రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉంది. మూడు మండలాలు షాద్‌నగర్ ఏసీపీ పరిధిలో, మాడ్గుల మండలం ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలో కొనసాగుతున్నాయి.

ఒకే కమిషనరేట్ పరిధిలోకి..

నాలుగు మండలాలు రెండు పోలీసు కమిషనరేట్ల పరిధిలో ఉండటంతో పాలనాపరంగా ఇబ్బందులు కలుగుతున్నాయి. రెండు కమిషనరేట్లు ఉండటంతో ప్రజా ప్రతినిధులకు కూడా ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో కల్వకుర్తి నియోజక వర్గ పరిధిలోని అన్ని మండలాలను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి తీసుకువచ్చి ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని చాలాకాలంగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పోలీసుశాఖ ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయానికి తహసీల్దార్ కార్యాలయ సమీపంలో రెండు ఎకరాలు భూమిని కేటాయించినట్లుగా తెలుస్తుంది. ఏసీపీ కార్యాలయ ఏర్పాటు దిశగా చర్యలు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భర్తతో గొడవపడిన మహిళ అదృశ్యం


విజయలక్ష్మి(ఫైల్)

మొయినాబాద్: భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని ఎనికేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రాజేశ్, విజయలక్ష్మి భార్యాభర్తలు, వీరికి కొడుకు, కూతురు సంతానం. కాగా శనివారం విజయలక్ష్మి భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించేదు. దీంతో ఆదివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

చేవెళ్లలో నవ వధువు..


పద్మ (ఫైల్)

చేవెళ్ల: నాలుగు నెలల క్రితం వివాహమైన నవ వధువు అదృశ్యమైంది. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల గ్రామానికి చెందిన ఎల్మెల మహిపాల్‌కు పద్మతో నాలుగు నెలల క్రితం వివాహమైంది. జూన్ 30న కుటుంబ సభ్యులు పొలం పనులు వెళ్లారు. అనతరం పద్మ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఆమెకోసం బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం ఆమె భర్త పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సొంతూరుకు బయలు దేరిన మహిళ..


లలిత(ఫైల్)

మొయినాబాద్: సొంతూరుకు వెళ్తానని బయలుదేరిన మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం శక్కన్‌నగర్ గ్రామానికి చెందిన గడప లలిత కుటుంబం కొంతకాలంగా మొయినాబాద్‌లో నివాసముంటుంది. శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో లలిత శక్కన్‌నగర్‌కు వెళ్లేందుకు మొయినాబాద్ నుంచి బయలుదేరింది. ఆమె వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో కొడుకు నితిన్‌కుమార్ శనివారం రాత్రి తన మిత్రుడు వంశీకి ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నాడు. లలిత అక్కడికి రాలేదని చెప్పడంతో పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం


శ్రవణ్ చౌహాన్ మృతదేహం

శంకర్‌పల్లి: ప్రేమ విఫలమై ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం రాత్రి మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శ్రవణ్ చౌహాన్(20) నగరంలోని కొండాపూర్ ప్రాంతంలోని హాఫీజ్‌పేట్‌లో నివాసం ఉంటున్నాడు. మోకిల శివారులోని కాశ్మీరీ విల్లాలో టైల్స్ పనులు చేసేందుకు వచ్చేవాడు. శనివారం సాయంత్రం వరకు పనులు చేసుకున్నాడు. సాయంత్రం అక్కడే బిల్డింగ్‌పై ఉన్న సోలార్ రాడ్‌కు షార్ట్‌తో ఉరేసుకున్నాడు. గమనించిన కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేశ్ కుమార్ తెలిపారు.

టిప్పర్ కింద పడి యువకుడి దుర్మరణం


అనిల్‌కుమార్ గౌడ్ (ఫైల్)

శంకర్‌పల్లి: టిప్పర్ కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలో చిన్న శంకర్‌పల్లి చెందిన అనిల్‌కుమార్‌గౌడ్(33) టిప్పర్ల యజమాని వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. రామంతపురం నుంచి చేవెళ్లకు నిర్మిస్తున్న లింక్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజాము వరకు వాహనాల లోడ్‌లను లెక్కించి అదే పరిసరాల్లో నిద్రించాడు. గమనించని ఓ టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని వెనక్కు తీస్తున్న క్రమంలో వాహనం అనిల్‌గౌడ్ మీదుగా వెళ్లింది. దీంతో తీవ్రగాయాల పాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య జ్యోతి, కూతురు భవార్షిత, కుమారుడు హర్షిత్ గౌడ్ ఉన్నారు. భార్య పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్‌పల్లి పోలీసులు తెలిపారు.

దేశంలో పౌష్టికాహార ఉద్యమం రావాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు

శంషాబాద్ రూరల్: శక్తిమంతమైన భారతదేశానికి పౌష్టికాహార (న్యూట్రిషినిజం) ఉద్యమం చాలా అవసరమని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్‌ట్రస్టు ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వరాజ్యం కోసం దేశ భక్తి ఉద్యమం సాగితే.. సురాజ్యం దిశగా పయనం సాగిస్తున్న దేశానికి ప్రస్తుతం పౌష్టికాహార ఉద్యమం కావాలన్నారు. ఈ దిశగా దేశ ప్రజలంతా ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. స్థూలకాయం, అధిక రక్తపోటు, మధుమేహం లాంటి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు పౌష్టికాహారం పట్ల అవగాహన పెంచడానికి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తాజా పండ్లు, తృణధాన్యాలు, చిరుధాన్యాలు రోజువారీ ప్రధాన ఆహారంగా తీసుకుంటే మంచి పోషకాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం ట్రస్టులో స్వయం ఉపాధి శిక్షణ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ధృవీకరణ పత్రాలు అందజేశారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమ, స్వర్ణ భారత్ ట్రస్టు హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి బి.సుబ్బారెడ్డి, మెడికవర్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ అనిల్‌కృష్ణారెడ్డి, సీఆర్పీఎఫ్ మాజీ డీజీ కె.దుర్గాప్రసాద్, ముప్పవరపు ఫౌండేషన్ ట్రస్టీ ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.

ఈత కొలనులో మునిగి వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: పుట్టిన రోజు వేడుకల కోసం వచ్చి ఈత కొలనులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అవుషాపూర్‌కు చెందిన పుడత రవి (58) హెచ్‌పీసీఎల్ ఉద్యోగి. సైనిక్‌పురిలో ఉంటున్నాడు. ఇతని పుట్టిన రోజు శనివారం జరగ్గా...ఆదివారం సెలవు ఉండడంతో తోటి స్నేహితులకు పార్టీ ఇచ్చేందుకు మధ్యాహ్నం ఘట్‌కేసర్‌కు వచ్చారు. కొండాపూర్ గ్రామ పరిధిలోని హెచ్ఎండీఏ వెంచర్ వెనకాల విందు చేసుకున్నారు. విందు అనంతరం పక్కనున్న పోచిరెడ్డి వ్యవసాయ పొలం దగ్గరి ఈత కొలనులోకి దిగారు. అందరు కొలనులో ఈదుతుండగా రవి నీటిలోకి దూకి మునిగిపోయాడు. వెంటనే స్నేహితులు బయటకు తీసి సీపీఆర్ చేసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.


రవి మృతదేహం

దేశానికి క్రీడాకారులను అందించడమే లక్ష్యం



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్

చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి



గచ్చిబౌలి: దేశానికి అవసరమయ్యే క్రీడాకారులను అందించడమే తెలంగాణ లక్ష్యమని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలోని స్విమ్మింగ్ కాంప్లెక్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన 76వ సీనియర్ నేషనల్ అక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గాంధీ, శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా క్రీడా పాలసీని సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 18వేల గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను నిర్మించామన్నారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మినీ స్టేడియాలను నిర్మిస్తున్నామన్నారు. దేశానికి, రాష్ట్రానికి పేరు తెస్తున్న క్రీడాకారులను గుర్తించి వారికి నగదు బహుమతి, విలువైన ప్రదేశాలలో ఇంటి స్థలాలను అందచేస్తుందన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్), తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు 5వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ పోటీలలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 500 మంది జాతీయ స్థాయి ప్రముఖ క్రీడాకారులతోపాటు 100 మంది ప్రముఖ క్రీడాకారులు పాల్గొంటున్నారు. తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఉమేష్, హోప్ ఫౌండేషన్ చైర్మన్, చీఫ్ ప్యాట్రన్ కొండా విజయకుమార్ పాల్గొన్నారు.